క్లుప్తంగా

రైతులు బీమా ప్రీమియం చెల్లించాలి

ముద్దనూరు : రబీలో సాగుచేసిన పంటలకు రైతులు బీమా ప్రీమియం చెల్లించాలని మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద రైతులు నేరుగా బ్యాంకులో చెల్లించాలని తెలిపారు. 1 హెక్టారుకు చెల్లించాల్సిన ప్రీమియంలు శనగకు రూ.1200, వేరు శనగకు రూ.1200, నువ్వులకు రూ.450, జొన్నకు రూ.787.50, పెసరకు రూ.675, ప్రొద్దు తిరుగుడుకు రూ.750, మినుముకు రూ.712.50, వరికి రూ.1575లు ప్రీమియం చెల్లించాలని మిగత వివరాలకు ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని ఏఓ సూచించారు.

విద్యార్థులకు సామగ్రి వితరణ

తొండూరు : మండలంలోని అగడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు బుధవారం ఆ పాఠశాల పూర్వపు విద్యార్థి, ఎస్ఆర్ఐ ఎ.బ్రహ్మంరెడ్డి రూ.10వేలతో స్టడీ మెటీరియల్‌ను అందించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలకు ఏ అవసరం వచ్చినా తగిన ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ బాబురెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సదస్సుకు తరలిరండి

సింహాద్రిపురం : ఈనెల 17వ తేదీన కడపలో జరిగే మాదిగల ఆత్మీయ సదస్సుకు డప్పు కళాకారులందరూ తరలి రావాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకులు కోళ్ల భాస్కర్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని లోమడ దళితవాడలో మాదిగల ఆత్మీయ సదస్సుకు సంబంధించిన కరపత్రాలను మాదిగ సోదరులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదస్సుకు డప్పు కళాకారులు జన సమీకరణతో రావాలని కోరారు.

సచివాలయ ఉద్యోగి మృతి

తొండూరు : స్థానిక సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కె.సుధీర్ బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. బంధువులు తెలిపిన వివరాల మేరకు సుధీర్ గత రెండు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీంతో మెరుగైన వైద్యం కోసం కడపలో ఓ ప్రైవేట్ హాస్పిటల్ తీసుకెళ్లారు. చికిత్స పొందుతుండగా బుధవారం మృతి చెందినట్లు వారు తెలిపారు.

నేత్రదానం

పులివెందుల టౌన్ : నేత్రదానంతో ఆయన చూపు సజీవమని నేత్ర సేకరణ సంస్థ అధ్యక్షుడు రాజు తెలిపారు. బుధవారం పట్టణంలోని భాకరాపురం వీధిలోని తల్లం తిరుపాలుశెట్టి మరణించడంతో ఆయన కుటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకరించారు. నేత్ర సేకరణ సంస్థ అధ్యక్షుడు రాజు కార్నియాలను సేకరించి హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపించారు.

నీటి కులాయి కనెక్షన్‌లను క్రమబద్ధీకరించుకోండి

జమ్మలమడుగు : మున్సిపాలిటీ పరిధిలో ఉన్న అక్రమ కులాయి కనెక్షన్‌లను ప్రజలు క్రమ బద్ధీకరించుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి తెలిపారు. మున్సిపాలిటీలో ఇటీవల జరిపిన సర్వేలో దాదాపు 11000 కులాయి కనెక్షన్‌లు ఉన్నాయి. అందులో 7,500 కులాయి కనెక్షన్లు తమరికార్డుల్లో ఉన్నాయి. మిగిలినవి అక్రమ కనెక్షన్లుగా గుర్తించడం జరిగింది. వారందరు మరో రెండు రోజుల్లో ఆ కనెక్షన్‌లను నిబంధనల ప్రకారం క్రమ బద్ధీకరించుకోకపోతే కులాయి కనెక్షన్‌లను తొలగిస్తామన్నారు.

రూ. 2.20 కోట్లతో అభివృద్ధి పనులు

కమలాపురం : కమలాపురం నగర పంచాయతీలో రూ.2.20 కోట్ల డీఎంఎఫ్ నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథ్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా కలెక్టర్ కమలాపురం అభివృద్ధి పనులకు డీఎంఎఫ్ నిధులు రూ.2.20 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధుల్లో రూ.1.26 కోట్లతో స్థానిక పాత స్టేట్ బ్యాంక్ భవనం నుంచి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేపడతామన్నారు. అలాగే రూ.70 లక్షలతో అప్పాయపల్లె తాగునీటి పైప్‌లైన్ రీప్లేస్ చేయడంతో పాటు ఇందిరమ్మ కాలనీ, పుట్టంపల్లె, పడమట వీధి, అక్సా నగర్ ప్రాంతాల్లో పైప్ లైన్లు ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే రూ. 24 లక్షల వ్యయంతో చెత్త సేకరణకు వాహనాలు కొనుగోలు చేస్తామని వివరించారు.

కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేయడం దారుణం

జమ్మలమడుగు : రిటైర్డు అయిన ఉద్యోగులనే కేంద్ర ప్రభుత్వం రైల్వేశాఖలో కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేయడం దారుణమని డీవైఎఫ్ఐ నాయకులు అన్నారు. ఈ సందర్భంగా వారు బుధవారం కాంట్రాక్టు పద్ధతిలో రిటైర్డు ఉద్యోగులను తీసుకోకూడదంటూ రైల్వేస్టేషన్ మాస్టర్ వివేకానందకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. దేశ వ్యాప్తంగా వివిధ శాఖల్లో దాదాపు పదికోట్ల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. వాటిని కేంద్ర ప్రభుత్వం భర్తీచేయడంలేదు. ఆదేవిధంగా 2023 జూన్ 1వ తేదీ నాటికి 2,61,233 పోస్టులు ఉండవలసి ఉండగా అందులో 53,178 పోస్టులు ఖాళీగా ఉన్నాయని రైల్వేశాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్ రాజ్యసభలో తెలిపారు. ఖాళీ పోస్టులను నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలని తెలిపారు. కాని కేంద్ర ప్రభుత్వం రైల్వే రిటైర్డు ఉద్యోగులతో భర్తీ చేయాలని చూస్తే డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఉద్యమిస్తామన్నారు.

మసిబారుతున్న బొగ్గు వ్యాపారుల జీవితాలు

- ఎన్నాళ్లూ ఈ బొగ్గు బతుకులు
- ప్రభుత్వాలు ఉపాధి అవకాశాలు కల్పించాలి



బొగ్గులను తయారు చేయడానికి సిద్ధంగా ఉంచి కట్టెల బట్టీ

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని ఉలిమెల్ల, ఎర్రిపల్లె గ్రామాలకు చెందిన కొంతమంది 30 ఏళ్ల నుంచి బొగ్గులను కాలుస్తూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా మా జీవితాలు మాత్రం బొగ్గు బతుకులుగా ఉంటున్నాయంటున్నారు. బొగ్గులు తయారీ చేయడానికి ఒక్కో బట్టీకి రూ.30వేల నుంచి రూ.40 వేల వరకు ఖర్చు అవుతుంది. కంప చెట్లను కొట్టుకుని వచ్చి వాటిని ఎండబెట్టి బొగ్గులను కాల్చుతున్నారు. కాల్చిన బొగ్గులను హిందూపురం, పాకాలా తదితర ప్రాంతాలకు పంపిస్తున్నారు. పెట్టుబడి ఖర్చులు ఎక్కువైనప్పటికి ఆదాయం అంతంత మాత్రంగా ఉంది. కొన్నిచోట్ల ఫ్యాక్టరీలకు బొగ్గులను సరఫరా చేస్తున్నారు. ప్రస్తుత మార్కెట్‌లో బొగ్గుల బస్తా ధర రూ.500ల నుంచి రూ.800లు పలుకుతోంది. ధరలు అంతంతమాత్రంగా ఉండటంతో కుటుంబ పోషణ భారంగా మారిందంటున్నారు. ప్రభుత్వం స్పందించి ఏవైనా ఉపాధి అవకాశాలు కల్పించాలంటున్నారు.

మారని బొగ్గు బతుకులు



మా తాత, ముత్తాతల కాలం నుంచి బొగ్గులను కాల్చుతూ కుటుంబాలను పోషిస్తున్నాం. గతంలో బొగ్గులకు మంచి డిమాండ్ ఉండేది. రాను రానూ బొగ్గులను అడిగేవారు లేరు. దీంతో వ్యాపారాలు జరగక కుటుంబాలను పోషించుకోవాలంటే చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

– నీలావతి, బొగ్గుల వ్యాపారి, ఉలిమెల్ల

ప్రభుత్వాలు ఆదుకోవాలి



బొగ్గులను తయారు చేసి కుటుంబాలను పోషించుకుంటున్న మమ్ములను ప్రభుత్వం ఆదుకోవాలి. 30 ఏళ్లుగా బొగ్గులను కాల్చుతున్నాము. బొగ్గులను కాల్చి అమ్మాలంటే పెట్టుబడులు ఎక్కువ అవతున్నాయి. ఎన్ని ప్రభుత్వాలు మారినా మా బతుకులు మారలేదు.

– ఆంజనేయులు, బొగ్గుల వ్యాపారి, ఉలిమెల్ల

గెలుపోటములు సహజం



క్రీడాకారులతో ఆర్డీఓ భానుశ్రీ, తదితరులు

పులివెందుల టౌన్ : క్రీడలలో గెలుపోటములు సహజమని ఆర్డీఓ భానుశ్రీ తెలిపారు. బుధవారం పట్టణంలోని స్థానిక వైఎస్సార్ క్రీడా మైదానంలో జిల్లా స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–14, 17, 19 బాలుర విభాగపు సాఫ్ట్ టెన్నిస్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆర్డీఓ మాట్లాడుతూ క్రీడలలో గెలుపోటములు సమానమన్నారు. అనంతరం జిల్లా స్కూలు గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి అరుణకుమారి మాట్లాడుతూ క్రీడాకారులకు ఎక్కడ ఎలాంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్త వహిస్తున్నామన్నారు. అలాగే అబ్జర్వర్ శ్రీ రవికుమార్ మాట్లాడుతూ క్రీడా ఎంపికలు పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నామని రాష్ట్ర జట్టు జాతీయ స్థాయి పోటీల్లో మంచి ఫలితాలు సాధించాలని ఆయన ఆశించారు. అలాగే ఈ పోటీలను నిర్వహిస్తున్న టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి విషయాన్ని దృష్టిలో పెట్టుకొని అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో విశిష్ట అతిథి డి.వి.కొండారెడ్డి, టోర్నమెంట్ నిర్వాహకులు ఎం.శ్రీకాంత్‌రెడ్డి, అబ్జర్వర్ రవికుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రవీణ్‌కుమార్, పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజలపై విద్యుత్ భారం మోపొద్దు



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సురేష్

వేంపల్లె : ప్రజలపై ఇటీవల వేసిన రూ.6,072 కోట్ల ట్రూ అప్ భారం ఇంకా అమలులోకి రాకముందే అంతకు రెట్టింపు భారాన్ని అదనంగా ప్రజలపై మోపటం దారుణమని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సురేష్ అన్నారు. బుధవారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు మేము అధికారంలోకి వచ్చాక విద్యుత్ చార్జీల భారం తగ్గిస్తామని చెప్పి మాట తప్పిందన్నారు. ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని, సర్దుబాటు చార్జీల బాదుడును అపాలన్నారు. మొత్తం రూ.17వేల కోట్ల భారం ప్రజలపై మోపేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైందన్నారు.

2022–23 వాడుకున్న విద్యుత్‌ను ఆనాటికి ఇంధనపు చార్జీలు ప్రస్తుతం వేసి ప్రజలకు కూటమి ప్రభుత్వం కరెంట్ షాక్ ఇస్తుందన్నారు. ప్రభుత్వ కరెంట్ ప్లాంటు జెన్‌కో నుండి విద్యుత్ ఇస్తే తక్కువ ధరకు, నాణ్యమైన కరెంట్ అందుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధిక ధరలకు మార్కెట్‌లో కరెంట్ కొనుగోలు చేస్తుందన్నారు. దీనివలన ప్రజలపై భారం పడుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాన్ని నిలుపుకోవాలన్నారు. అన్ని నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోవడంతోపాటు అన్ని రకాల పన్నులు పెరిగియన్నారు. ఈ భారాన్ని ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకట్రాములు, సహాయ కార్యదర్శి కొత్త కాల్వ బ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి సత్కారం



ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని సత్కరిస్తున్న ఆర్‌సీడీఎస్ అధ్యక్షుడు సురేంద్రారెడ్డి, సభ్యులు

పులివెందుల టౌన్ : కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి ఇంటర్నేషనల్ హైవే రోడ్లు వర్కింగ్ కమిటీ మెంబర్‌గా సెంట్రల్ గవర్నమెంట్ ఇవ్వడంతో పులివెందులలో ఆయన నివాసంలో రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు యరప్రరెడ్డి సురేంద్రారెడ్డి, కదిరి వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ నియోజకవర్గ కన్వీనర్ అడ్వకేట్ లింగాల లోకేశ్వర్ రెడ్డిలు సత్కరించారు. కార్యక్రమంలో రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ సభ్యులు పులివెందుల, కదిరి వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

104 ఆరోగ్య సేవల సిబ్బందికి వేతనాలు చెల్లించాలి

వల్లూరు(చింతకొమ్మదిన్నె) : 104 ఆరోగ్య సేవ సిబ్బంది రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చింతకొమ్మదిన్నె పరిధిలోని సిబ్బంది తమ సమస్యలపై స్థానిక మండల ఆరోగ్య కేంద్రంలోని వైద్యులు కే.రాఘవేంద్ర, బి.సునీతలకు వినతిపత్రం అందజేశారు. 104 ఆరోగ్య సేవల సిబ్బందికి గత మూడు నెలలుగా వేతనాలు చెల్లించలేదని, తమ కుటుంబాలను పోషించుకోవడం చాలా కష్టంగా ఉందని, 104 సేవలను ప్రభుత్వమే నిర్వహించాలని, తమకు న్యాయంగా రావలసిన బకాయిలను చెల్లించాలని, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో 104 ఆరోగ్య సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.మహమ్మద్ అలీ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆహార కల్తీపై సర్టిఫికెట్ కోర్సు ముగింపు



మాట్లాడుతున్న రిటైర్డు డీఎఫ్‌సీ విశ్వనాథరెడ్డి

పులివెందుల టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం కెమిస్ట్రీ అండ్ ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో కల్తీ ఆహారంపై కోర్సు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డు డీఎఫ్‌సీ విశ్వనాథరెడ్డి ఆహార కల్తీ నిరోధక చట్టాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే డయాబెటిక్, ఒబెసిటీ సొసైటీ మాజీ జీఎం రఘురామిరెడ్డి మిల్లెట్స్ ప్రయోజనాలను, కల్తీ ఆహారంలో ఎలా జరుగుతున్నది, కల్తీలేని ఆరోగ్యాన్నిచ్చే ఆహారాన్ని ఎలా తీసుకోవాలనే విషయాలపై వివరించారు. అలాగే కల్తీ ఆహారం తీసుకోవడంవలన అనేక అనారోగ్యాలతో పాటు దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు ఏర్పడే ప్రమాదం ఉందని, జంక్ ఫుడ్ మంచిది కాదన్నారు. ఆహారాన్ని నమిలి మింగాలని, నీటిని నెమ్మదిగా తాగాలని, సూర్యోదయంలో వాకింగ్ చేయడంవల్ల డి విటమిన్ సమృద్ధిగా లభిస్తుందని, వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. అనంతరంవారు విద్యార్థులకు కోర్సు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాసులు, కోర్స్ కో ఆర్డినేటర్లు ఎల్.సుధీర, బాలనారాయణ, శ్రీనిత ఇతర అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ఏపీజీబీ సేవలపై ప్రజలకు అవగాహన

సింహాద్రిపురం : మండలంలోని గురిజాల గ్రామంలో బుధవారం ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో నాబార్డు సౌజన్యంతో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీజీబీ బ్యాంక్ సిబ్బంది ప్రజలకు ఏపీజీబీ నుంచి ప్రజలకు అందుతున్న సేవలు, పథకాలు, రుణాలు, ఇన్సూరెన్స్ పథకాల గురించి కళాజాత బృందం మాటలు, పాటల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీజీబీ ఫీల్డ్ ఆఫీసర్ మధుసూదన్‌రావు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామం, ఉలిమెల్ల లేక్ సందర్శన



శిల్పారామ ఏఓ సుధాకర్‌తో మాట్లాడుతున్న నూతన సీఈఓ స్వామినాయుడు

పులివెందుల టౌన్ : పట్టణంలోని శిల్పారామం, ఉలిమెల్ల లేక్‌ను బుధవారం సాయంత్రం రాష్ట్ర శిల్పారామం నూతన సీఈఓ వి.స్వామినాయుడు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పులివెందుల శిల్పారామం కార్యాలయంలో ఏఓ సుధాకర్, కార్యాలయ సిబ్బంది, ఫీల్డ్ సిబ్బందితో పలు అంశాలపై మాట్లాడారు. శిల్పారామం, ఉలిమెల్ల లేక్ అభివృద్ధికి అవసరమైన అనుమతుల కోసం వెంటనే నివేదిక ఇవ్వాలన్నారు. బోటింగ్ పాండ్‌లో బోటు షికారు చేసే వారు తప్పక లైఫ్ జాకెట్లు ధరించేలా చూడాలన్నారు. శిల్పారామం, ఉలిమెల్ల లేక్‌లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో అన్ని శిల్పారామంలో కూడా ఇవే నిబంధనలు వర్తిస్తాయన్నారు. కార్యక్రమంలో ఏఈ వెంకటసుబ్బయ్య, ఫీల్డ్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సరస్వతీమాత విగ్రహం ప్రతిష్ట

పులివెందుల రూరల్ : మండలంలోని నల్లపురెడ్డిపల్లె జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో బుధవారం పూర్వ విద్యార్థులు రూ.60వేలతో సర్వసతీమాత విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఈ సందర్భంగా పూర్వపు విద్యార్థులను పాఠశాల హెడ్మాస్టర్ కమలనాథశర్మ అభినందించారు. కార్యక్రమంలో లింగాల ఎంఈఓ–2 రామకృష్ణయ్య, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పులివెందుల రూరల్ : పట్టణంలోని ఉలిమెల్ల రోడ్డు, అహోబిలాపురం, గాయత్రినగర్ కాలనీ, ఆర్టీసీ బస్టాండు వరకు, ఉలిమెల్ల లేక్ శిల్పారామం, టీటీడీ కల్యాణ మండపం వెనుక వైపు తదితర ప్రాంతాలలో గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ జేఈ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులతో వ్యాయమ ఉపాధ్యాయుడు శివశంకర్‌రెడ్డి

పెండ్లిమర్రి : మండలంలోని గంగనపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు జిల్లాస్థాయి టెన్నికాయిట్ పోటీలలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఓ సావిత్రి దేవి, వ్యాయమ ఉపాధ్యాయుడు శివశంకర్‌రెడ్డిలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం కడప నగరంలోని ఉర్దూ మున్సిపల్ హైస్కూల్‌లో జిల్లాస్థాయి పోటీలు నిర్వహించారు. జిల్లాస్థాయి టెన్నికాయిట్ పోటీలల్లో హైస్కూల్‌కు చెందిన బాలభాస్కర్, రెడ్డయ్య, ఖలీల్, సుష్మలు మంచి ప్రతిభ కనభరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైయ్యారు. ఎంపికైన విద్యార్థులకు హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

మండల సమగ్రాభివృద్ధికి సహకరించండి

పెండ్లిమర్రి : మండల సమగ్రాభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించి మండలాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని ఎంపీపీ ఎం.వరలక్ష్మి తెలిపారు. స్థానిక ఎంపీడీవో సభా భవనంలో బుధవారం ఎంపీపీ మాచునూరు వరలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాలల్లో పారిశుధ్య పనులపై ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం మండలస్థాయి అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, తహసీల్దార్ అనురాధ, మండలస్థాయి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, కార్యదర్శిలు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

ఎర్రగుంట్ల : పోట్లదుర్తి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న దేవి, హర్షవర్ధన్‌లు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.పద్మనాభరాజు తెలిపారు. ఈనెల 2, 3, 4 తేదీలలో అనకా పల్లి జిల్లాలోని తుమ్మపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన అండర్–17 పోటీలలో ఖోఖో లో రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనపరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. డిసెంబర్ 5, 6, 7 తేదీలలో ఉత్తర ప్రదేశ్ అయోధ్యలో జాతీయస్థాయి పోటీలు జరుగుతాయన్నారు. అలాగే అక్టోబర్ నెల 28, 29 తేదీలలో జరిగిన రాష్ట్రస్థాయి యోగాసన పోటీలలో హర్షవర్ధన్ (పదవ తరగతి) ప్రతిభ కనపరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఉపాధ్యాయురాలు బి.లక్ష్మీ, సబితారాణిలను అభినందించారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. చర్మవ్యాధుల వైద్య నిపుణులు నవంబర్ నెల నుంచి ఆదివారమునకు బదులుగా శుక్రవారం అందుబాటులో ఉంటారన్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 నెంబర్లను సంప్రదించాలన్నారు.

జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడులు



కమలాపురం : వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

కమలాపురం : రైతులు తమ పంటల సాగులో జాగ్రత్తలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఏడీఏ నరసింహారెడ్డి, ఏఓ సరస్వతి తెలిపారు. మంగళవారం మండలంలోని పుట్లంపల్లి, మీరాపురం గ్రామాలలో నిర్వహించిన పొలం పిలుస్తోంది.. కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. మినుము, వరి పంటలను పరిశీలించారు. చిరు పొట్టదశలో ఉన్న వరి పొలానికి ఆకు ముడత పురుగు ఆశించిందన్నారు. ఆకులను నిటారుగా ముడత చేసుకుని పత్ర హరితాన్ని గోకి తినడం వలన ఆకుల మీద తెల్లని చారలు ఏర్పడి కిరణజన్య సంయోగ క్రియకు ఆటంకం కలుగ జేస్తుందన్నారు. ఆకుముడత పురుగును గమనించ నప్పుడు తాడును పట్టుకుని అటు ఇటుగా 2–3 సార్లు లాగడం వలన ఆకు ముడతలోని గొంగళి పురుగులు నీళ్లలో పడి చనిపోతాయన్నారు. వాటి నివారణకు ఎసిఫేట్ 300 గ్రాములు, లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 400 గ్రాములు లేదా క్లోరాంత నిలిప్రోల్ 60 మి.లీ. మందును 200 లీటర్ల నీటి ద్రావణంలో కలుపుకుని ఒక ఏకరా పంటకు పిచికారి చేయాలన్నారు. రబీ సాగుకు అనువైన రకాలను ఎంపిక చేసుకోవాలన్నారు. నవంబర్ 15 నుంచి డిసెంబర్ 15 వరకు వరి నాట్లను వేసుకోవడానికి అనుకూలమన్నారు. ఏఈఓ దస్తగిరి, వీఏఏ శివ రంజని, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పత్తి పంటలో గులాబీ రంగు పురుగు నివారణతోనే అధిక దిగుబడి

వేముల : పత్తి పంటలో గులాబీ రంగు పురుగు నివారణతోనే అధిక దిగుబడులు సాధించవచ్చునని కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ శిల్పకళ తెలిపారు. బుధవారం మండలంలోని గొల్లలగూడూరు, పెర్నపాడు, నల్లచెరువుపల్లె గ్రామాల్లో పత్తి పంట పొలాలను వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయ అధికారులతో కలిసి ఆమె సందర్శించారు. పత్తి పంటకు ఆశించిన గులాబీ రంగు పురుగును గుర్తించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రత్తి పంట వేసిన 60 రోజుల నుంచి పంటలో కాయ తొలిచే పురుగు, గులాబీ రంగు పురుగులు ఆశిస్తాయన్నారు. వీటి నివారణకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు వేపనూనె కషాయం, లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ పురుగులు ఆశిస్తే ప్రోఫెనోపాస్ మందు ప్రతి లీటర్ కి రెండు ఎంఎల్ చొప్పున పిచికారి చేసుకోవాలని, థయోడికార్బ్ ఒక లీడర్ నీటికి 1.5 గ్రాముల మందును, క్వినాల్‌పాస్ ఒక లీటర్ నీటికి 2.5 ఎంఎల్ మందును పిచికారి చేసుకోవాలన్నారు. ఒకవేళ పంట చివరి దశలో ఉన్నట్లయితే పురుగు నివారణకు లాంబ్డా సైహలాత్రిన్ ఒక లీటర్ నీటికి 1ఎంఎల్ చొప్పున పిచికారి చేసుకున్నట్లయితే పురుగుల ఉధృతిని నివారించవచ్చున్నారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి నాగభూషణ్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి చెన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతులు సంఘాలుగా ఏర్పడితే ప్రయోజనాలు

వల్లూరు(చింతకొమ్మదిన్నె) : చింతకొమ్మదిన్నె మండల పరిధిలోని ఇప్పపెంట, బుగ్గలపల్లి గ్రామాలలో బుధవారం వ్యవసాయ శాఖ వారి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వ్యవసాయ శాఖ ఏడి శంకర్ నాయక్ ఆయా గ్రామాలలోని చీని, నిమ్మ తోటలు, అరటి తోటలను పరిశీలించి, సస్యరక్షణ చర్యల గురించి, పంటల బీమా గురించి వివరించి, రైతులు సంఘాలుగా ఏర్పడటం ద్వారా కలిగే అదనపు ప్రయోజనాల గురించి రైతులకు వివరంగా తెలియజేశారు. మైక్రో ఇరిగేషన్ అధికారి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ బోరు నీటి సౌకర్యం వుండి 5 ఎకరాలలోపు ఉన్న రైతులకు 90 శాతం సబ్సిడీతో, ఐదు ఎకరాలకు మించి భూమి ఉన్న రైతులకు 70 శాతం సబ్సిడీతో డ్రిప్పు పరికరాలు, స్ప్రింక్లర్లు అయితే 50% సబ్సిడీతో ఇవ్వడం జరుగుతుందని, కావలసిన రైతులు రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాల్సిందిగా తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఈశ్వర్‌రెడ్డి, ఉద్యాన అధికారి జ్యోతిర్మయి, వీహెచ్ఏలు శిల్పా, రేఖ, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, ఆయా గ్రామ రైతులు పాల్గొన్నారు.

సస్య రక్షణ చర్యలతో అధిక దిగుబడి పొందవచ్చు

వీరపునాయునిపల్లె : సస్య రక్షణ చేపట్టడం వలన అధిక దిగుబడి సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు తెలిపారు. బుధవారం మండలంలోని యు.రాజుపాలెం గ్రామంలో చేపట్టిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు పలు సూచనలు అందించారు. గ్రామంలో ఎక్కువగా వరి పంట సాగులో ఉందని ఈ పంటలో ఆకునల్లి, కాండం తొలుసు పురుగు, పాము పోడ తెగులు ఉన్నట్లు గుర్తించామన్నారు. మినుము పంటలో పల్లాకు తెగులు కనిపించిన మొక్కలను తొలగించాలని తెలిపారు. రసం పీల్చే పురుగు ఉధృతిని తగ్గించేందుకు ముందు జాగ్రత్తగా వేపనూనె 5 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పంటపై పిచికారి చేసుకోవాలన్నారు. రైతు సేవా కేంద్ర సహాయకుడు గంగయ్య, రైతులు పాల్గొన్నారు.

జొన్నకు కత్తెర పురుగు తెగుళ్లు

జమ్మలమడుగు : రైతులు సాగుచేసిన జొన్న పంటకు కత్తెర తెగులుసోకిందని రైతులు కత్తెరపురుగు నివారణకు చర్యలు తీసుకోవాలని ఏఓ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. బుధవారం ఉప్పలపాడు గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రబీసీజన్‌లో రైతులు సాగుచేసే శనగ పంటకు మేలైన యాజమాన్య పద్ధతులను పాటిస్తే దిగుబడి ఎక్కువగా వస్తుందన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

పంటల బీమా ప్రీమియం చెల్లించాలి

వేముల : రబీలో సాగు చేసుకున్న పంటలకు వచ్చేనెల 15వ తేదీలోపు పంటల బీమాకు సంబంధించి ప్రీమియం రైతులే చెల్లించాలని ఏఓ చెన్నారెడ్డి తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం గొల్లలగూడూరు రైతు సేవా కేంద్రంలో రైతులతో నిర్వహించిన సమావేశం ఆయన పాల్గొని మాట్లాడారు. రబీలో అన్నిరకాల పంటలకు బీమా ప్రీమియం చెల్లించవచ్చునన్నారు. పంటల బీమాకు చెల్లించే రైతులు రైతు సేవా కేంద్రంలో పంట ధృవీకరణపత్రం, పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ పాసు పుస్తకం మీసేవలో అందించి ప్రీమియం నగదును చెల్లించాలన్నారు. అలాగే రబీలో ఎక్కువగా మినుము, శనగ పంటలను రైతులు సాగు చేసుకున్నారని.. శనగ పంటలో తెగుళ్ల నివారణకు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. పచ్చ పురుగు లార్వా మొదటి, రెండుదశలలో ఉంటే లీటరు నీటికి అస్ఫేట్ 2 గ్రాములు కలిపి పిచికారి చేయాలన్నారు. మూడవ, నాల్గవ దశలలో ఉన్నట్లయితే ఏమమేక్టిన్ బెంజోయేట్ లీటరు నీటికి 0.3గ్రాములు కలిపి పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మండల సమగ్రాభివృద్ధికి సహకరించండి

పెండ్లిమర్రి : మండల సమగ్రాభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించి మండలాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని ఎంపీపీ ఎం.వరలక్ష్మి తెలిపారు. స్థానిక ఎంపీడీవో సభా భవనంలో బుధవారం ఎంపీపీ మాచునూరు వరలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాలల్లో పారిశుధ్య పనులపై ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం మండలస్థాయి అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, తహసీల్దార్ అనురాధ, మండలస్థాయి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, కార్యదర్శిలు పాల్గొన్నారు.